Karimnagar 10.07.2012

ప్రజాశక్తి
ప్రతి అక్షరం ప్రజల పక్షం

# యువకుడిగా వెళ్లాడు...వృద్ధుడిగా వచ్చాడు...!

## 23 సంవత్సరాల తర్వాత స్వగ్రామానికి నర్సయ్య

ప్రజాశక్తి-ఎల్లారెడ్డిపేట

క్షణికావేశంలో తీసుకున్న నిర్ణయంతో తన వాళ్లను కాదనుకున్నాడు. 23 సంవత్సరాల క్రితం ఇల్లు వదిలి వెళ్లాడు. అనారోగ్యం పాలయ్యాడు. మానసిక రోగిగా తయారయ్యాడు. రోడ్లపై తిరిగాడు. ఈ మధ్యనే అతన్ని గుర్తించిన శ్రద్ధ రిహాబిలేషన్ ఫౌండేషన్ అనే సామాజిక కార్యకర్తలు ఏడునెలలుగా చికిత్స చేయించారు. అతని స్వగ్రామమైన ఎల్లారెడ్డిపేటకు తీసుకొచ్చారు. కుటుంబ సభ్యులకు అప్పగించారు. మానవత్వం ఇంకా బతికే ఉందని చాటారు...



నర్సయ్యతో సామాజిక కార్యకర్తలు

మండల కేంద్రంలోని పెన్నం చంద్రయ్య-అనసూయ దంపతులకు ముగ్గురు కొడుకులు, ముగ్గురు కూతుళ్లు. మేర కులానికి చెందిన చంద్రయ్య దర్జీ పనులు చేస్తూ వీరిని పోషించాడు. ఈ క్రమంలో 23 సంవత్సరాల క్రితం రెండో కుమారుడైన పెన్నం నర్సయ్య ఇంటి నుండి వెళ్లిపోయాడు. అప్పుడు ఆయన వయసు 50 సంవత్సరాలు. తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు నర్సయ్య ఆచూకీ కోసం చాలాకాలం పాటు వెతికారు. ఫలితం దక్కలేదు. నర్సయ్య మృతి చెందాడని భావించిన కుటుంబ సభ్యులు ఆశలు వదులుకున్నారు. చేతికందొచ్చిన కొడుకు కనిపించకపోవడంతో తల్లి అనసూయ మనోవేదనకు గురై కొన్ని సంవత్సరాల క్రితం మృతి చెందింది. అన్న సత్యనారాయణ సిరిసిల్లలో తన భార్య పిల్లలతో కలిసి ఉంటున్నాడు. తమ్ముడు మహేష్ మండల కేంద్రంలో టైలర్ వృత్తి చేసుకుంటూ తన తండ్రితో కలిసి జీవిస్తున్నాడు. సోదరీలు కృష్ణవేణి, సువర్ణ, విజయకు వివాహాలయ్యాయి. కాలక్రమేణా నర్సయ్యను వారూ మరిచి పోయారు. అనివార్య కారణాలతో ఇంటి నుండి వెళ్లిన నర్సయ్య మానసిక రోగిగా తయారయ్యాడు. 7 నెలల క్రితం శ్రద్ధ రిహాబిలేషన్ ఫౌండేషన్ సామాజిక కార్యకర్తలైన విజయ్ బ్రహ్మణి, కిషోర్‌కుమార్‌కు తారసపడటంతో నర్సయ్యకు వారు చికిత్స చేయించి సోమవారం ఎల్లారెడ్డిపేటలోని బంధువులకు అప్పగించారు. లేదనుకున్న వ్యక్తిని 23 సంవత్సరాల తరువాత ఇంటికి తీసుకువచ్చిన సామాజిక కార్యకర్తలకు కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.